## క్లుప్తంగా

### అంగన్‌వాడీ కార్యకర్తకు పీహెచ్‌డీ



పెనమలూరు: అంగన్‌వాడీ కార్యకర్తగా పని చేస్తున్న కుక్కల మాధవికి పీహెచ్‌డీ (డాక్టరేట్) వచ్చింది. యనమలకుదురులో అంగన్‌వాడీ కార్యకర్తగా మాధవి గత 15 సంవత్సరాలుగా పని చేస్తోంది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు. ఉన్నత చదువులు చదువుకోవాలనే తపనతో ఆమె 2015లో ఎంఫిల్ చేసింది. ఆ తర్వాత ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో గుంటూరు జిల్లాలో 'జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం -మహిళల భాగస్వామ్యం' అనే అంశంపై ఆమె పరిశోధన చేసింది. ప్రొఫెసర్ ఎం.త్రిమూర్తిరావు పర్యవేక్షణలో ఆమె చేసిన పరిశోధనకుగానూ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పీహెచ్‌డీ(డిపార్టుమెంట్ ఆఫ్ సోషల్ వర్క్) ప్రకటించింది. తన కుటుంబంతో పాటు అందరి సహకారంతో పీహెచ్‌డీ సాధించానని మాధవి తెలిపారు.

### దేశ నిర్మాణంలో యువత పాత్ర కీలకం



గన్నవరం రూరల్: మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ సి.శోభనాద్రి సిద్ధార్థ నర్సింగ్ కళాశాలలో గురువారం నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యాన నైబర్‌హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం జరిగింది. జిల్లా అధికారి సుంకర రాము అధ్యక్షతన జరిగిన సభలో పలువురు వక్తలు మాట్లాడుతూ యువత దేశ నిర్మాణం కోసం తమను తాము అంకితం చేసుకోవాలని సూచించారు. నాయకత్వ లక్షణాలు పెంచుకుని రాజకీయాల్లో రాణించాలన్నారు. ప్రజా సమస్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో అల్లు మురళీ, శంకర్‌నాథ్, డాక్టర్ జాస్మిన్ తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరికి జరిమానా విధించిన 12వ ఏఎంఎం కోర్టు

గన్నవరం: ఆస్తి వివాదం విషయంలో కుటుంబ సభ్యులపై కత్తితో దాడి చేసిన ఇరువురికి గన్నవరం 12వ అదనపు మేజిస్ట్రేట్ కోర్టు గురువారం జరిమానా విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ సమాచారం మేరకు.. మండలంలోని ముస్తాబాదకు చెందిన వేము అన్నమ్మ కుటుంబంలో ఆస్తి వివాదాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 28 సెప్టెంబర్ 2021న అన్నమ్మ, ఆమె కుమార్తె అనిత ఇంటిలో ఉండగా ఆమె పెద్ద కుమారుడు అనంతనాగ్, అతని భార్య నాగలింగేశ్వరి ఆస్తి వివాదం విషయమై కత్తితో దాడికి ప్రయత్నించారు. వీరిని అడ్డుకునే ప్రయత్నం చేసిన అన్నమ్మ చిన్న కుమారుడైన వేము అశోక్‌కుమార్ తలకు గాయమైంది. ఈ ఘటనపై గన్నవరం పోలీసులు కేసు నమోదు చేయగా 12వ ఏఎంఎం కోర్టులో విచారణ జరుగుతుంది. ఈ నేపథ్యంలో నేరం రుజువు కావడంతో నిందితులైన అనంత్‌నాగ్, నాగలింగేశ్వరికి రూ. 2 వేలు చొప్పున జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. జరిమానా చెల్లించని పక్షంలో ఇరువురికి నెల రోజుల పాటు సాధారణ జైలు శిక్ష విధించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నారు.

### విజయవాడలో సందడి చేసిన నేహాశెట్టి



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): డీజే టిల్లు ఫేమ్, సినీ నటి నేహా శెట్టి గురువారం నగరంలో సందడి చేశారు. గాయత్రి నగర్‌లోని వీఎస్ఎన్ మాల్‌లో 'రాన్' పేరుతో ఏర్పాటు చేసిన వస్త్ర దుకాణాన్ని గురువారం సాయంత్రం ఆమె ప్రారంభించారు. నేహాశెట్టి రాకతో ఆ ప్రాంతంలో యువత కేరింతలతో నిండిపోయింది. టిజే టిల్లు సినిమాలో నేహాశెట్టి పాత్ర పేరు అయిన రాధిక అంటూ యువత సందండి చేశారు. డీజే టిల్లు సినిమా పాటలకు నేహా శెట్టి డ్యాన్స్ చేసి యువతకు ఉత్సాహ పరిచారు. విజయవాడ అంటే తనకు చాలా ఇష్టమని నేహా శెట్టి చెప్పారు. రాన్ షోరూమ్ అధినేత విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ ఫ్యాషన్ అంటే ఇష్టపడే వారికి రాన్ స్టోర్ సరైన ఎంపిక అవుతుందన్నారు.

### 4న ఎస్ఆర్ఆర్‌లో జాబ్ ఫెయిర్

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జవహర్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఈ నెల 4వ తేదీన జాబ్ ఫెయిర్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు కంపెనీలు కొటక్ మహీంద్ర, ముత్తూట్ ఫైనాన్స్, డామినీర్ ఇంటీరియర్స్, కూరాకు ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ పాల్గొని వారికి అవసరమైన అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయన్నా రు. జాబ్ ఫెయిర్‌లో గ్రాడ్యుయేట్ ట్రైనీ, మార్కెటింగ్ మేనేజర్, రిలేషన్‌షిప్ మేనేజర్, పర్చేజ్ అసిస్టెంట్ వంటి పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లమో, ఏదేని డిగ్రీ, బీటెక్, ఎంబీఏ చదివిన వారు పాల్గొనేందుకు అర్హులు అన్నారు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్న వారితో పాటు కోర్సు పూర్తిచేసిన వారు కూడా వారి అర్హత సర్టిఫికెట్లతో హాజరుకావచ్చునన్నారు. ఎంపికయ్యిన అభ్యర్థులకు అదేరోజు నియామక పత్రాలు అందజేస్తామని తెలిపారు. మరింత సమాచారం కోసం కళాశాలలోని జేకేసీ సెంటర్‌లో స్వయంగా కానీ జేకేసీ సమన్వయకర్త జి.విజయదీప్ 9573778554 నంబర్‌లో కానీ సంప్రదించాలని కోరారు.

# అభివృద్ధి బాటలో గొడవర్రు

- రూ. 3.17 కోట్లతో అభివృద్ధి పనులు
- ప్రభుత్వ కార్యాలయాలకు సమకూరిన భవనాలు
- డీబీటీ ద్వారా రూ. 18.83 కోట్లు లబ్ధి
- నాన్ డీబీటీ కింద రూ. 8.63 కోట్లు లబ్ధి



తుదిదశలో ఉన్న రైతుభరోసా కేంద్రం



అందుబాటులోకి వచ్చిన గ్రామ సచివాలయం

కంకిపాడు: ఒకప్పుడు శిథిల పంచాయతీ.. పెచ్చులూడిన శ్లాబు.. బిక్కు బిక్కు మంటూ ఉద్యోగుల బాధ్యతల నిర్వహణ.. అధ్వానంగా ఉన్న అంతర్గత రహదారులు.. ఇంటి స్థలం దక్కక ఇరుకు ఇళ్లల్లో జీవనం.. ఇదంతా నాటి పరిస్థితి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గొడవర్రు గ్రామం అభివృద్ధి బాటలో పయనిస్తోంది. అధునాతన వసతులతో ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు సమకూరుతున్నాయి. అంతర్గత రహదారుల రూపురేఖలు మారాయి. దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలకు మోక్షం లభించింది. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల గొడవర్రు వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**రూ. 3.17 కోట్లతో అభివృద్ధి..**

గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రాధాన్యతా క్రమంలో సమస్యలకు పరిష్కారం చూపుతున్నారు. నిధుల కేటాయింపులో ఎక్కడా వివక్ష లేకుండా అభివృద్ధికి ప్రాధాన్యం కల్పిస్తున్నారు. గ్రామంలో రూ. 3.17 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు నిర్వహించారు.

- నాడు–నేడు కింద పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన రూ. 45.06 లక్షలతో చేపట్టారు.
- గడప గడపకు మన ప్రభుత్వంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి రూ. 20 లక్షలు కేటాయించారు.
- గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, మిల్క్‌సెంటర్ల ఏర్పాటుకు రూ. 76.44 లక్షలు వెచ్చించారు.
- గ్రామ పంచాయతీ నిధులు రూ. 8 లక్షలతో ఎస్సీ శ్మశానవాటికకు రహదారి నిర్మించారు. 2012లో గ్రామంలో పేదలకు కేటాయించిన ఇళ్లస్థలాల లే అవుట్‌లో రూ. 4 లక్షలతో అంతర్గత రహదారులను నిర్మించారు. రూ. 80 వేలతో రబ్బిష్ రోడ్డు ఏర్పాటు చేశారు.
- రూ. 1.91 లక్షలతో ఎస్సీ శ్మశాన వాటికకు వెళ్లే మార్గంలో విద్యుత్ లైన్లు ఏర్పాటు జరిగింది. బీసీ ఏరియాలో రూ. 60 వేలతో విద్యుదీకరణ పూర్తి చేశారు.
- మండల పరిషత్ నిధులు రూ. 5 లక్షలతో అంతర్గత రహదారులు, రూ. 10 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణం జరిగింది. ఎంపీ నిధులు రూ. 10 లక్షలతో సిమెంటు రోడ్ల నిర్మాణం, మరో రూ. 10 లక్షలతో ఓసీ శ్మశానవాటిక నుంచి ఎస్సీ శ్మశానవాటిక మార్గం రబ్బిష్ రోడ్డుగా అభివృద్ధి చేశారు.
- జలజీవన్ మిషన్ నుంచి రూ. 1.07 కోట్లతో రక్షిత మంచినీటి పథకం నిర్మాణం చేపట్టారు.

**రూ. 27.46 కోట్లు లబ్ధి..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి వివిధ పథకాలను అమలు చేస్తోంది. సంక్షేమ పథకాల ద్వారా నేరుగా 5553 మంది లబ్ధిదారుల ఖాతాలకు రూ. 18,83,25,672 జమయ్యింది. పరోక్షంగా 2070 లబ్ధిదారులకు రూ. 8,63,27,355 లబ్ధి చేకూ రింది. నిరుపేదలను గుర్తించి గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా 213మంది పేదలకు గ్రా మంలో నివేశనస్థలాలను చూపింది. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లోనూ అండగా నిలిచి సంక్షేమాన్ని అందించిందని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారు.

**డీబీటీ కింద పొందిన లబ్ధి**

| పథకం | లబ్ధిదారులు | జరిగిన లబ్ధి(రూ.) |
|---|---|---|
| వైఎస్సార్ ఆసరా | 688 | రూ. 2.55 కోట్లు |
| అమ్మ ఒడి | 333 | రూ. 1.47 కోట్లు |
| జగనన్న చేదోడు | 48 | రూ. 9.60 లక్షలు |
| కోవిడ్ సాయం | 1010 | రూ. 10.10 లక్షలు |
| పంటల బీమా | 86 | రూ. 1.21 కోట్లు |
| వైఎస్సార్ ఈబీసీ నేస్తం | 43 | రూ. 10.95 లక్షలు |
| హౌసింగ్ (నేరుగా చెల్లింపు) | 89 | రూ. 88.47 లక్షలు |
| రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ | 228 | రూ. 28.50 లక్షలు |
| జగనన్న తోడు(వడ్డీ) | 69 | రూ. 31,587 వేలు |
| జగనన్న వసతి దీవెన | 158 | రూ. 24.97 లక్షలు |
| జగనన్న విద్యాదీవెన | 194 | రూ. 76.99 లక్షలు |
| వైఎస్సార్ కళ్యాణ మస్తు | 2 | రూ. 1.50 లక్షలు |
| వైఎస్సార్ కాపునేస్తం | 22 | రూ. 11.10 లక్షలు |
| వైఎస్సార్ పింఛను కానుక | 694 | రూ. 6.96 కోట్లు |
| వైఎస్సార్ రైతుభరోసా | 436 | రూ. 1.55 కోట్లు |
| సున్నా వడ్డీ పంట రుణాలు | 139 | రూ. 4.62 లక్షలు |
| సున్నా వడ్డీ | 749 | రూ. 15.00 లక్షలు |
| వైఎస్సార్ వాహన మిత్ర | 23 | రూ. 7.10 లక్షలు |
| వైఎస్సార్ ఆరోగ్య ఆసరా | 90 | రూ. 4.68 లక్షలు |
| వైఎస్సార్ ఆరోగ్యశ్రీ | 148 | రూ. 62.61 లక్షలు |
| వైఎస్సార్ బీమా | 10 | రూ. 20.60 లక్షలు |
| వైఎస్సార్ చేయూత | 294 | రూ. 1.30 కోట్లు |
| **మొత్తం** | **5553** | **రూ. 18.83 కోట్లు** |

**నాన్ డీబీటీ కింద పొందిన లబ్ధి**

| పథకం | లబ్ధిదారులు | జరిగిన లబ్ధి(రూ.) |
|---|---|---|
| జగనన్న గోరుముద్ద | 205 | రూ. 20.30 లక్షలు |
| హౌస్ సైట్స్ | 213 | రూ. 5.23 కోట్లు |
| జగనన్న తోడు(రుణాలు) | 92 | రూ. 17.12 లక్షలు |
| బియ్యం కార్డులు | 1094 | రూ. 2.38 కోట్లు |
| ట్యాబ్‌లు | 25 | రూ. 3.30 లక్షలు |
| జగనన్న విద్యా కానుక | 198 | రూ. 14.06 లక్షలు |
| వైఎస్సార్ సంపూర్ణ పోషణ | 243 | రూ. 45.51 లక్షలు |
| **మొత్తం** | **2070** | **రూ. 8.63 కోట్లు** |

**సంక్షేమం ఇంటి తలుపు తట్టింది..**



ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటి వద్దనే అందుతున్నాయి. పాపకు ట్యాబ్ వచ్చింది. విద్యాకానుక అందించారు. అమ్మ ఒడి ఇస్తున్నారు. వాహన మిత్ర కూడా అందుతోంది. ఎలాంటి సిఫార్సు లేకుండానే అర్హత ఉన్న ప్రతీ పథకం వస్తోంది. సీఎం జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– పరసా జ్యోతి, గ్రామస్తురాలు

**అభివృద్ధికి ప్రాధాన్యం..**



ప్రభుత్వం అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తోంది. ప్రజలు సంతోషంగా ఉన్నారు. గ్రామంలో అభివృద్ధి పనులపై దృష్టి సారించాం. ఇప్పటికే రూ. 3.17 కోట్లుతో అభివృద్ధి పనులు పూర్తి చేస్తున్నాం. దీర్ఘకాలిక సమస్యలను గుర్తించి వాటికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తున్నాం.

–మేరుగు విజయచంద్రశేఖర్, సర్పంచ్, గొడవర్రు

## జెడ్పీ హైస్కూల్‌లో భోజనశాల నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న వాణిమ్మ, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం బుద్ధవరం గ్రామానికి చెందిన మాగంటి మురళీ ముందుకు వచ్చారు. సుమారు రూ. 20 లక్షలతో నిర్మించనున్న భోజనశాలకు గురువారం ఆయన మాతృమూర్తి మాగంటి వాణిమ్మ భూమిపూజ చేసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, జెడ్పీటీసీ సభ్యురాలు అన్నవరపు ఎలిజబెత్ రాణి, మాజీ వైస్ ఎంపీపీ గొంది పరంధామయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ పాఠశాలలను నాడు–నేడు ద్వారా కార్పొరేట్ స్కూల్స్‌కు ధీటుగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. ప్రభుత్వంతో పాటు దాతలు కూడా స్వచ్ఛందంగా ముందుకువచ్చి తమవంతు తోడ్పాటునందించడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా ముక్కామల జగదీశ్వరరావు పేరుతో ఏర్పాటు చేసిన ఈ పాఠశాలలో ఆయన మనవడు మురళీ తన సొంత నిధులతో వంటశాల, భోజనశాల నిర్మిస్తుండటం అభినందనీయమని పేర్కొన్నారు. వీటిని త్వరితగతిన నిర్మాణం చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. పాఠశాల హెచ్‌ఎం వీ రజనీకుమారి, ఇన్‌చార్జి బీ పున్నమదేవి, గ్రామ ప్రముఖులు పొన్నగంటి శివ, మెట్లపల్లి రాంబాబు, గుర్రం నరసయ్య, బడుగు మరియదాసు, మద్దినేని వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## విద్యార్థి వైద్యానికి 'కేవీఆర్' సాయం



విద్యార్థికి నగదు అందజేస్తున్న రమణ, కిషోర్

గన్నవరం: తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఓ విద్యార్థికి కేవీఆర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కేవీఆర్ ఇండోర్ స్టేడియం టీమ్ సభ్యులు అండగా నిలిచారు. ఆ విద్యార్థి వైద్య చికిత్సలకు వీరంతా కలిసి రూ. 27 వేలు సాయం చేసి సేవాభావం చాటుకున్నారు. విద్యార్థి శ్రీకర్, అతని తల్లి లక్ష్మీమానసకు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కేవీ రమణ, కేవీఆర్ కిషోర్ గురువారం నగదు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక జెడ్పీ బాలురోన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న వెలగపూడి శ్రీకర్ కొంత కాలంగా అంతు చిక్కని వ్యాధితో బాధపడుతున్నారని చెప్పారు. పలు ఆస్పత్రుల్లో పరీక్షలు చేయించినప్పటికి వ్యాధి నిర్ధారణ కాకపోవడంతో తమిళనాడులోని వెల్లూరు ఆస్పత్రికి తీసుకువెళ్లాలని వైద్యులు సూచించినట్లు తెలిపారు. అయితే పేద కుటుంబానికి చెందిన శ్రీకర్ కుటుంబం వైద్య సాయం కోసం తమ అసోసియేషన్‌ను సంప్రదించినట్లు చెప్పారు. అసోసియేషన్‌తో పాటు ఇండోర్ స్టేడియం టీమ్ సభ్యులు మానవతా దృక్పథంతో ముందుకువచ్చి విద్యార్థి వైద్య చికిత్సకు ఆర్థిక తోడ్పాటు అందించినట్లు తెలిపారు. టీమ్ సభ్యులు చందు, ఆలీ, నళినికుమార్, భగవాన్, ఎస్పీ జాన్, శ్రీను, రూప్, ప్రేమ్, వెంకి, చెన్నారావు, వ్యాయామోపాధ్యాయుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# నయనానందకరం.. శిడిబండి ఉత్సవం

- శోభాయమానంగా వేడుక
- ఉత్సవానికి పోటెత్తిన అశేష భక్తజనం



శిడిబండి వేడుకకు ఊరేగింపుగా వస్తున్న పెళ్లికుమారుడు అనుపమ్







ఉయ్యూరు: వీరమ్మతల్లికి జై అంటూ భక్తజన హారతుల నడుమ శిడిబండి ఊరేగింపు శోభాయమానంగా జరిగింది. ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల మహోత్సవంలో ప్రధాన ఘట్టమైన శిడిబండి వేడుక గురువారం నయనానందకరంగా సాగింది. అమ్మవారి తిరునాళ్ల మహోత్సవంలో 11వ రోజు శిడిబండి ఉత్సవం నిర్వహించడం సాంప్రదాయంగా వస్తోంది. అమ్మవారి సాంప్రదాయం ప్రకారం పట్టణంలోని పాత వాటర్ ట్యాంకు బజారులో ప్రత్యేకంగా తయారు చేసిన శిడిబండికి గుమ్మడికాయలు ఏర్పాటు చేసి భక్తులు పసుపు నీరు ఓరబోయడంతో ఊరేగింపు ప్రారంభమైంది. కాలేజీ రోడ్డు, ప్రధాన సెంటరు గుండా సాగిన శిడి బండి ఊరేగింపును వేలాదిగా తరలివచ్చిన భక్తులు శిడిబండికి గుమ్మడికాయలు కట్టి, పసుపు నీరు ఓరబోసి భక్తిపారవశ్యం చెందారు. ఆచారం ప్రకారం ఉయ్యూరు ఎస్సీ కాలనీకి చెందిన ఉయ్యూరు వంశస్తుడు అనుపమ్ బంధువులు, మేళతాళాలు, చలువకావిళ్లతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని ప్రదక్షిణ చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. శిడిబండిని ఆలయ ప్రదక్షిణ చేయించి అమ్మవారి ఆలయం ఎదురుగా శిడిబండిని నిలిపి వేడుకను పూర్తి చేశారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ప్రధాన రహదారి, ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. పోలీసులు ముందస్తుగానే భద్రతా, ట్రాఫిక్ మళ్లింపు చర్యలు తీసుకున్నారు. డీఎస్పీ, సీఐ హబీబ్ బాషా, వీ శ్రీనివాసరావు బందోబస్తును పర్యవేక్షించారు.

## అమర గాయకుల సేవలు సదా స్మరణీయం



మాట్లాడుతున్న రమా సత్యనారాయణ, వేదిక మీద శ్రవంతి కృష్ణ మల్లాది స్వాతి తదితరులు

విజయవాడ కల్చరల్: అమర గాయకుల సంగీత సేవలు సదా స్మరణీయమని విశ్వమాతా చారిటబుల్ వ్యవస్థాపకుడు నిడుమోలు రమా సత్యనారాయణ అన్నారు. శ్రవంతి కృష్ణా ఈవెంట్స్ అండ్ ఎంటర్‌టైనర్, తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో గురువారం అమర గాయకులకు స్వరాజంలి కార్యక్రమం నిర్వహించారు. రమా సత్యరాయణ మాట్లాడుతూ అలనాటి మధుర గాయకులు రాగ, తాళ, యుక్తంగా గానం చేసి అభిమానులను రంజిపజేసేవారన్నారు. శ్రవంతి కృష్ణ మాట్లాడుతూ నాటి గాయనీ గాయకుల సేవలను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు గాయకుల కృషిని అభినందించారు. మల్లాది స్వాతి మీరాకుమార్, బీర్ సుషీల్‌కుమార్, భారతి, శ్రీనివాసరావు, కేఎస్ఎన్ మూర్తి, ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం, భానుమతి తదితరులు గానం చేసిన సినీ గీతాలను ఆలపించారు. గాయకుడు కేఎస్ఎన్ మూర్తిని నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

## సీఎం జగన్‌తోనే సంక్షేమ రాజ్యం



'గడప గడపకు' కార్యక్రమంలో మున్సిపాలిటీ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్

పెనమలూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమ రాజ్యం సాధ్యమని తాడిగడప మున్సిపాలిటీ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అన్నే శ్రావణ్‌కుమార్ అన్నారు. కానూరు మురళీనగర్‌లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న అధికారం చేపట్టిన తర్వాత అర్హులైన ప్రతీ ఒక్కరికి కులమత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో తిరిగి జగనన్నను గెలిపించుకుంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ నాయకుడు వేమూరి బాలకృష్ణ, పార్టీ నాయకులు అంగిరేకుల సీతారామయ్య, తుమాటి శ్రీరాములు, కాకర్ల సుబ్బరాజు, ఆంజనేయప్రసాద్, రమాదేవి, వాసు తదితరులు పాల్గొన్నారు.

### నున్న గ్రామ పంచాయతీ సమావేశం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో అంతర్గత రబ్బీష్ రోడ్లను ఏడు ప్రాంతాల్లో నిర్మించేందుకు పంచాయతీ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. గ్రామ సర్పంచి కాటూరి సరశ్రీనివాస్ అధ్యక్షతన గురువారం పంచాయతీ సమావేశం జరిగింది. సమావేశంలో గ్రామ పంచాయతీ నిధులు రూ. 10 లక్షలతో నిర్మించే రబ్బిష్ రోడ్ల నిర్మాణానికి తీర్మాణం చేయడం జరిగింది. గొల్లపూడి నుంచి అవుటుపల్లి వరకు నేషనల్ హైవే సంస్థ రోడ్డు నిర్మించిన నేపథ్యంలో సీఆర్‌డీఏ గతంలో మాస్టర్ ప్లాన్‌లో చూపించిన రోడ్డు నిర్మాణం లేనందున నున్న గ్రామంలో భూసేకరణకు ప్రతిపాదించిన భూములకు మినహాయింపు కోరుతూ సమావేశం తీర్మాణం చేసింది. సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు బొంతు సరోజిని, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

పెనమలూరు: తాడిగడప జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవడంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి లక్ష్మీపురంకాలనీలో బండి పిచ్చయ్య ఉంటున్నాడు. అతను విజయవాడలో అధ్యాపకుడిగా పని చేస్తాడు. అతని భార్య డెలివరీ కావడంతో ఆస్పత్రి వెళ్లడానికి పిచ్చయ్య, అతని మేనల్లుడు పోతురాజురమేష్ బయలుదేరి తాడిగడప జంక్షన్ వద్దకు రాగా, ఎదురుగా వచ్చిన మరో బైక్ వీరిని ఢీ కొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ఇద్దరూ రోడ్డుపై పడి గాయపడ్డారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### రేపు పోరంకిలో ప్రజాదర్బార్

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకిలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించనున్నట్లు మున్సిపాలిటీ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయ న వివరాలు తెలుపుతూ శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా దర్బార్‌ను మంత్రి జోగి రమేష్ ద్వారకా రెసిడెన్సీలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రజాదర్బార్‌లో ప్రజల సమస్యలు తెలుకుని పరిష్కరిస్తారని అన్నా రు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు విధిగా హాజరవ్వాలన్నారు. ప్రజలు తమ సమస్యలు మంత్రి దృష్టికి తీసుకురావాలని సూచించారు.

### పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

ఉంగుటూరు: ఈ నెల 3వ తేదీ ఆదివారం నిర్వహించనున్న పల్స్ పోలియోను విజయవంతం చేయాలని ఉంగుటూరు పీహెచ్‌సీ వైద్య అధికారి ప్రసన్నరాణి అన్నారు. స్థానిక విలేకరులతో గురువారం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలు, పాఠశాలలు, కమ్యూనిటీ సెంటర్లు, సచివాలయల వద్ద ఆరోగ్య సిబ్బంది పల్స్ పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. పోలియో మహమ్మారిని నిర్మూలించేందుకు అయిదు సంవత్సరాల లోపు పిల్లలందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని సూచించారు.

### యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం

పెనమలూరు: నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతోనే జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు అన్నారు. పోరంకిలో గురువారం హ్యాపీ మైండ్స్ ట్రెనింగ్ సెంటర్‌లో జిల్లా ఉపాధి కల్పన శాఖ, స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ వారు సంయుక్తంగా మినీ జాబ్ మేళాను నిర్వహించారు. ఈ సందర్భంగా విక్టర్‌బాబు మాట్లాడుతూ ప్రభుత్వ ఆధ్వర్యంలో జాబ్‌మేళాలు నిర్వహించి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. జాబ్‌మేళాలో 31 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతలో నైపుణ్యం పెంపొందించే విధంగా అనేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. యువతకు ఉపాధి కోసం ప్రముఖ కంపెనీలను సంప్రదించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అనంతరం పలువురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా నియామక అధికారి తుర్లపాటి మధు, కోఆర్డినేటర్ ఎం.శంకర్, కంపెనీల హెచ్‌ఆర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

### నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వలంటీర్ల తొలగింపు

విజయవాడరూరల్: విధులపట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్న అంబాపురం గ్రామంలోని ఆరుగురు వలంటీర్లను ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య గురువారం విధుల నుంచి తొలగిస్తూ ఆదేశాలు జారీ చేశారు. పింద్రాల ఏడుకొండలు, బండారు ప్రభావతి, నందేటి ప్రశాంతి, యలవర్తి శ్యాంప్రసాద్, కొక్కిలిగడ్డ ప్రేమావతి, వీ వెంకన్నబాబులను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీఓ శ్రీరమ్య తెలియజేశారు.